

రెండో విడతకు నిరీక్షణ

కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయం రెండో విడత అమలులో జాప్యం జరుగుతోంది. బడ్జెట్ కేటాయించలేదని తెలుస్తోంది. 8లో▸



గుర్తింపు ఎన్నికలపై కొర్రీ

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై మళ్లీ కొర్రీ పడింది. షెడ్యూల్‌ను శుక్రవారం ప్రకటిస్తారని భావించగా ఎటూ తేలకుండా ఈ నెల 27కు సమావేశం వాయిదా పడింది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

ఉదయం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పశ్చిమ నైరుతి దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వచ్చే నెలలో మంత్రి కేటీఆర్ రాక!

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- బీఆర్ఎస్ శ్రేణుల ఏర్పాట్లు



మంత్రి కేటీఆర్‌తో సుమన్, సతీశ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే నెల ఒకటిన చెన్నూరు నియోజకవర్గం మందమర్రి, రామకృష్ణాపూర్ పరిధిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జిల్లాకు రానున్నట్లు సమాచారం. శుక్రవారం ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ ప్రగతిభవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే మంత్రితో తన నియోజకవర్గంలో పర్యటన చేయించి బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి షెడ్యూల్ అధికారికంగా ఇంకా ఖరారు కావాల్సి ఉంది. బీఆర్ఎస్ శ్రేణులకు సమాచారం రావడంతో ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధం అవుతున్నాయి. మందమర్రికి చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాక, ఇక్కడ పార్టీని కాపాడుకునేందుకు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎమ్మెల్యే టికెట్లు రాక అసంతృప్తులుగా ఉన్న బీఆర్ఎస్ నాయకుల్లో విభేదాలు తొలగించేందుకు కూడా ప్రయత్నాలు మొదలయ్యాయి. బెల్లంపల్లి టికెట్ ఆశించి భంగపడిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ రాష్ట్ర స్థాయిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియామకం అయ్యారు. ఇక మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్‌కు సైతం త్వరలో రాష్ట్ర స్థాయిలో ఓ పదవీ వరించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

ఈ-పంచాయతీ ఆపరేటర్ల సమ్మె నోటీసు



కలెక్టర్‌కు నోటీసు అందజేస్తున్న ఆపరేటర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామ పంచాయతీ పనులను పర్యవేక్షిస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు సమ్మె బాట పట్టనున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 28 నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, డీపీఓ వెంకటేశ్వర్ రావుతోపాటు ఇతర అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దాసరి నరేందర్, ఈ-పంచాయతీ ఆపరేటర్ల జిల్లా అధ్యక్షుడు రాకేష్ మాట్లాడుతూ 13ఏళ్లుగా పని చేస్తున్నా ఉద్యోగ భద్రత లేదని, ఒక్కొక్కరు ఐదు నుంచి పది గ్రామ పంచాయతీల పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పేస్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఆపరేటర్లకు ప్రసూతి సెలవు వేతనంతో కల్పించాలని కోరారు. ఈ-పంచాయతీ ఆపరేటర్ల జిల్లా ఉపాధ్యక్షుడు పవన్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుమారస్వామి, ఆపరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి.రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: మన ఊరు–మన బడి, గ్రామ పంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రితో కలిసి అభివృద్ధి పనుల పురోగతిపై మండల పరిషత్ అభివృద్ధి, మండల పంచాయతీ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు–మన బడిలో మొదటి విడత ఎంపిక చేసిన జిల్లాలోని 248 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మూత్రశాలలు, భోజనశాల, వంటశాల, ప్రహరీ నిర్మాణం పనులు 85 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. 135 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణం మంజూరు చేయగా.. 89 పంచాయతీల పనులు సాగుతున్నాయని, మిగతా వాటి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని తెలిపారు.

హైవే అవస్థలు..!



జోడువాగు వంతెన సమీపంలో రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు



ఇరుకుగా ఉన్న జోడువాగు వంతెన

- ఎన్‌హెచ్–16 రోడ్డు నిర్మాణం అసంపూర్ణమే!
- ఆరేళ్లయినా అనుమతి దాటలె..
- అటవీ అనమతులు రాక నిలిచిన పనులు
- చేతులెత్తేసిన నిర్మాణ సంస్థ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/చెన్నూరు: గత ఆరేళ్లుగా జాతీయ రహదారి–63 పనులు సా..గుతూనే ఉన్నాయి. నిజామాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్‌ను కలిపే రోడ్డు జిల్లా గుండా వెళ్తోంది. జిల్లా కేంద్రం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి జైపూర్ మండలం రసూల్‌పల్లి వంతెన వరకు 9.8కిలోమీటర్ల వరకు ఒక నిర్మాణ సంస్థ, అక్కడి నుంచి కోటపల్లి మండలం ప్రాణహిత వంతెన వరకు 42.4కిలోమీటర్ల పనులు రెండు వేర్వేరు సంస్థలు చేస్తున్నాయి. ఐబీ చౌరస్తా నుంచి రసూల్‌పల్లి వరకు రోడ్డు ప్రమాదాలు ఏడు చోట్ల(బ్లాక్ స్పాట్స్) అధికంగా జరుగుతున్నాయని, 2021–22 వార్షిక ప్రణాళిక కింద రూ.59.79 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. రోడ్డు విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. జైపూర్ మండలం ఇందారం బీట్‌లో అనుమతి లేకుండా పనులు చేశారని అటవీశాఖ అభ్యంతరం చెప్పి ఆ కాంట్రాక్టర్‌కు జరిమానా వేయడం తెలిసిందే. మళ్లీ అనుమతులకు అర్జీ పెట్టుకోగా పరిశీలనలో ఉంది. పనుల జాప్యంతో ఇటీవల శ్రీరాంపూర్ బైపాస్ వద్ద ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది.

జోడువాగు వద్ద నరకం

చెన్నూరు, భీమారం మధ్యనున్న జోడు వాగు వద్ద ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. 70ఏళ్ల నాటి పాత వంతెన ఇరుకుగా ఉండి భారీ వాహనాలు, బైక్‌పై వెళ్లే వాళ్లు ఒక కిలోమీటరు దూరానికి 30నిమిషాలు పడుతోంది. అత్యవసరంగా అంబులెన్స్‌లో రోగులను తరలించాలంటే ఒక్కోసారి ప్రాణాల మీదకు వస్తోంది. మంచిర్యాల, కరీంనగర్, నిజామాబాద్ వెళ్లేందుకు, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండల, మహారాష్ట్ర, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా ప్రజలు ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తారు. ఆర్టీసీ బస్సులు రోజుకు సుమారు 40కి పైగా ట్రిప్పులు నడుస్తున్నాయి. మంచిర్యాల డిపోకు ఈ రూట్‌లోనే అధిక ఆదాయం ఉంది. ఇసుక క్వారీల నుంచి అధిక లోడ్ లారీలు వెళ్లి రోడ్డు ఓ వైపు కుంగింది. ఆరేళ్ల క్రితం ట్రాఫిక్ అంచనాతో డీపీఆర్ చేయగా, పెరిగిన రవాణాకు నిర్మించిన రోడ్డు తట్టుకోక దెబ్బతింటోంది. నిర్మాణదారే నాలుగేళ్ల నిర్వహణ బాధ్యత చూడాలి. కానీ వంద శాతం పని పూర్తయ్యాకే ఆ బాధ్యత చేపడుతారు. మరోవైపు చెన్నూరు మండలం బావురావుపేట శివారులో 'టోల్ ప్లాజా' నిర్మాణం పూర్తయితే టెండర్లు పిలిచి టోల్ వసూళ్లు మొదలు కానున్నాయి.

చేతులెత్తేసిన నిర్మాణ సంస్థ

జైపూర్ మండలం నర్వా నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు నిర్మిస్తున్న కాంట్రాక్టరు పనుల్లో తీవ్రంగా జాప్యం చేశారు. రెండేళ్లలోనే చేయాలి. కానీ పొడగింపులు తీసుకుని ఆరేళ్లు సాగదీశారు. ఇటీవల జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్, భీమారం, చెన్నూరు మండల పరిధిలో ప్రధాన రోడ్డు పూర్తి చేశారు. ఇంకా జైపూర్, భీమారం, చెన్నూరు మండలం కిష్టంపేట, జోడు వాగు వద్ద మొత్తం రిజర్వు ఫారెస్టులోని 9.12కిలోమీటర్ల మేర పూర్తి కాలేదు. అటవీ అనుమతులు రాకపోగా, మిగిలిన పనులు మేం చేయలేమని నిర్మాణ సంస్థ చేతులెత్తేసింది. ఈ మేరకు అధికారులకు ఓ లేఖ రాసింది. వాస్తవానికి మొత్తం పనులు పూర్తి చేయాల్సి ఉన్నా అనుమతుల జాప్యం కారణంగా తాము చేసేదేమీ లేదని తేల్చిచెప్పింది. అనుమతులు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ పరిధిలో ఉండడంతోనూ జిల్లా, రాష్ట్ర అటవీ శాఖ అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పేరుకు జాతీయ రహదారి అయినా ఇంకా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.



శ్రీరాంపూర్ బైపాస్ వద్ద నిలిచిన విస్తరణ పనులు



జైపూర్: రసూల్‌పల్లిలో పూర్తి కాని సెంట్రల్ లైటింగ్

ఎన్‌హెచ్–63 రోడ్డు వివరాలు

(నర్వా నుంచి ప్రాణహిత తీరం వరకు)

అంచనా వ్యయం : రూ.250కోట్లు
పరిహారం, ఇతర వ్యయం : రూ.60కోట్లు
టెండరు వేసింది : రూ.163.8కోట్లు
మొత్తం దూరం : 42.4 కిలోమీటర్లు
పూర్తయింది : 33.28 కిలోమీటర్లు
మిగిలింది : 9.12 కిలోమీటర్లు
పనులు మొదలైంది : 2017

అనుమతులు రాగానే పనులు

ఎన్‌హెచ్–16రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇందారం బీట్, జైపూర్, భీమారం, చెన్నూరు పరిధిలో నాలుగు చోట్ల అటవీ అనుమతులు రాగానే ఆ పనులు మొదలవుతాయి. జోడువాగు వంతెనకు ఇరువైపుల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే శాశ్వత రోడ్డు నిర్మిస్తాం.

– అమీర్‌పాషా, డీఈ, ఎన్‌హెచ్

నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య పరిస్థితి, దోమలు వృద్ధి చెందకుండా తీసుకునే చర్యలపై మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. పట్టణ ప్రజలు మీ ప్రాంతంలోని సమస్యలపై కమిషనర్‌ను సంప్రదించవచ్చు.

మున్సిపాలిటీ : మంచిర్యాల
సమయం : శనివారం ఉదయం
11 గంటల నుంచి 12 గంటల వరకు
ఫోన్ నంబర్ : 99491 53168
అంశం : పట్టణంలోని పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు పెరగకుండా చర్యలు, దోమలను అరికట్టే చర్యలు

రక్తదానంపై అవగాహన పోస్టర్ల విడుదల

మంచిర్యాలటౌన్: అక్టోబర్ 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించేలా తయారు చేసిన అవగాహన పోస్టర్లను కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం విడుదల చేశారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఒకటిన నిర్వహించే రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని లయన్స్‌క్లబ్ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి, ఎన్.వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, డేగ బాబు, వి.వినయ్‌కుమార్, సిరిపురం శ్రీనివాస్, కె.భాస్కర్‌రెడ్డి, చందూరి మహేందర్ పాల్గొన్నారు.

వీడని వాన

- మూడు రోజులుగా వర్షం
- 41.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



కోటపల్లి: వరద ఉధృతికి దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈ నెల 20 నుంచి మొదలైన వర్షం మూడు రోజులుగా కురుస్తూనే ఉంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు మోస్తారు నుంచి భారీ వర్షం అన్ని మండలాల్లో కురిసింది. 41.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పూత దశలో ఉన్న పత్తి పంటకు నష్టం వాటిల్లింది. కలుపు నివారణతోపాటు ఇప్పటికే ఎరువులు, స్ప్రే మందులు వేసుకున్న రైతులకు నష్టం వాటిల్లుతోంది. సింగరేణి ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతోంది. మరో రెండ్రోజులు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఎడతెరిపి లేని వర్షాలతో పూత, కాతకు వస్తున్న పంటలకు మేలు కన్న నష్టమే ఎక్కువని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో..

భీమిని మండలంలో 96.5 మిల్లీమీటర్లు, వేమనపల్లిలో 83.8, నెన్నెలలో 61.6, తాండూర్‌లో 60.7, బెల్లంపల్లిలో 54.7, చెన్నూర్‌లో 52.5, కోటపల్లిలో 50, కన్నెపెల్లిలో 48.9, భీమినిలో 42.8, జైపూర్‌లో 38.7, మంచిర్యాలలో 33.5, మందమర్రిలో 21.1, హాజీపూర్‌లో 20, దండేపల్లిలో 18.6, కాసిపేటలో 18, నస్పూర్‌లో 14.8, లక్సెట్టిపేటలో 13.9, జన్నారంలో 12 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం 907.7 మిల్లీమీటర్లు కాగా 989.8 మిల్లీమీటర్లు కురిసింది. 9 శాతం అధికంగా నమోదైంది.

కోటపల్లిలో..

కోటపల్లి: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నక్కలపల్లి, బ్రహ్మణపల్లి సమీపంలో వాగులో వరద ఉధృతితో పంటలు మునిగాయి. పార్‌పల్లి, లింగన్నపేట లోత్రొ వాగు ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహించడంతో ఆలుగామ, సిర్సా, అన్నారం గ్రామాల్లో పంటలు మునిగిపోయాయి.

వేమనపల్లిలో..

వేమనపల్లి: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. నీల్వాయి వాగు, కొత్తపల్లి వాగు, మత్తడివాగులు వరద నీటితో ప్రవహించాయి. నీల్వాయి వాగు, మత్తడి వాగు వంతెనల వద్ద అప్రోచ్‌రోడ్డు బురదమయంగా మారింది. ముల్కలపేట బొందచేను ఒర్రె వద్ద అసంపూర్తిగా వంతెన వరద నీటితో నిండి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చామనపల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామ పంచాయతీకి రాకపోకలు స్తంభించాయి. ఎంచపాయతోపాటు సడంకమోరి వద్ద వరి, పత్తి పంట పొలాలు నీట మునిగాయి.

నిలిచిన రాకపోకలు

నెన్నెల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నెన్నెల మండల కేంద్రంలోని లంబాడితండా ఎర్ర వాగు ఉప్పొంగి కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో మన్నెగూడం, జంగాల్‌పేట, కోణంపేట, కుర్మగూడం, చిన్న, పెద్దలంబాడితండా, పాటి, దమ్మిరెడ్డిపేట, బొగంపల్లి, ఖర్జీ గ్రామాలకు ఆరు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్ఐ గణేష్ ఎర్రవాగును సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఎవరూ ఎర్రవాగును దాటవద్దని సూచించారు.

కూలిన ఇళ్లు

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలువురి ఇళ్లు కూలాయి. భీమిని మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధి తంగళ్లపల్లికి చెందిన ఇందూరి మొండమ్మకు చెందిన ఇల్లు కూలింది. కన్నెపల్లి మండలం దాంపూర్ గ్రామానికి చెందిన తలండి పద్మ ఇంటి గోడలు కూలిపోయాయి.

ఉపాధ్యాయుల కాలక్షేపం..!

- బదిలీలు, పదోన్నతులు ఆన్‌లైన్‌లోనే..
- అయినా పరిశీలన పేరిట బడి బయట టీచర్లు
- డీఈవో కార్యాలయంలోనే తిష్ట

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియంతా ఆన్‌లైన్‌లో సాగుతుండగా.. ఒకట్రెండు వచ్చే గ్రీవెన్స్(అభ్యంతరాల పరిశీలన)కు 24 మంది ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వెరిఫికేషన్(డిప్యూటేషన్) పేరిట రోజుల తరబడి కాలక్షేపం చేస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో ఈ నెల 3 నుంచి 5వరకు పూర్తయింది. 6, 7, 8వ తేదీల్లో ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతులను డీఈవో కార్యాలయంలో సమర్పించారు. ఈ నెల 6 నుంచి సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు డిప్యూటేషన్(వెరిఫికేషన్ టీం) ఇస్తూ డీఈవో ప్రొసిడింగ్ ఇచ్చారు. ఎనిమిది మంది ప్రధానోపాధ్యాయులు, వీరికి సహాయకులుగా 12మంది ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు పూర్తయ్యే వరకు డీఈవో కార్యాలయంలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. 6నుంచి 8వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగిసిపోవడం, మిగిలిన అభ్యంతరాల నుంచి సీనియార్టీ జాబితా ప్రదర్శనకు వరకు అంతా ఆన్‌లైన్‌లో కొనసాగుతుంది. ఒకటి రెండు గ్రీవెన్స్‌కు వస్తే నలుగురు ఉంటే సరిపోతుంది. కానీ పని లేకున్నా అందరూ అక్కడే ఉంటూ బడికి డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

బోధనపై ప్రభావం

బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో బడిబయట టీచర్లతో బోధనపై ప్రభావం పడుతోంది. ఎక్కడికి బదిలీ వస్తుంది..? పదోన్నతుల జాబితాలో పేరు ఎక్కడుంది..? ఇలా రకరకాల చర్చల్లో మునిగి తేలుతున్నారు. కాగా, 24మందిని డిప్యూటేషన్ కేటాయించడంపై పెదవి విరుస్తున్నారు. వీరిలో పాఠశాలలను చక్కదిద్దాల్సిన హెచ్‌ఎంలు ఉండడం గమనార్హం. ఉపాధ్యాయులను రిలీజ్ చేయకపోవడం వల్ల బడికి డుమ్మా కొడుతున్నారు.

సర్వే..పరీక్షలు

నవంబర్ 3నుంచి స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరుగనుంది. ఈ నెల 23నుంచి ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 30లోపు ఎఫ్ఏ–2 పరీక్షలు పూర్తి చేయాల్సి ఉంది. అక్టోబర్ 6నుంచి ప్రారంభమయ్యే ఎస్ఏ–1 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంది. శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం యథావిధిగా కొనసాగించాలని డీఈవో ఆదేశించారు. అయినా కొందరు హెచ్‌ఎంలు, టీచర్లు డీఈవో ఆఫీస్ వెరిఫికేషన్ టీం (డ్యూటీ పేరిట) తప్పించుకుంటున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు నియమించాం

ఆరు టీముల్లో ఆరుగురు ఉపాధ్యాయులున్నారు. మిగతా వాళ్లందరూ పాఠశాలకు వెళ్తున్నారు. బదిలీ, పదోన్నతుల నేపథ్యంలో అవసరం మేరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు విధులు కేటాయించాం. సర్టిఫికెట్ల పరిశీలన, సర్వీసు వెరిఫికేషన్, గ్రీవెన్స్ పరిశీలన చేశారు. ప్రస్తుతం పని తగ్గడంతో ఒక్కో టీంలో ఒక్కరే ఉన్నారు. ఏ రోజుకు ఆరోజు గ్రీవెన్స్ వస్తే డిస్పోజ్ చేస్తున్నారు.

– యాదయ్య, డీఈవో

నేటి నుంచి విద్యార్థులకు ప్రాక్టీస్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాల అంచనాకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి దేశవ్యాప్తంగా నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంటు సర్వే నిర్వహించనుంది. ఈ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా రాష్ట్రాలకు ర్యాంకులు నిర్ణయిస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని విద్యార్థులకు ఆరు ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తూ విద్యా ప్రమాణాల నిర్ధారణకు ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్య పాఠశాలలు, కేజీబీవీ, యూఆర్ఎస్‌లో చదువుతున్న 3, 6, 9 తరగతుల వారికి పరీక్ష నిర్వహించనున్నారు. ఒక్కో తరగతికి ఆరు పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 23, అక్టోబర్ 3, 27, 31, నవంబర్ 2న నిర్వహించే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. బదిలీల షెడ్యూల్ సాకుగా చూపి పరీక్షలు నిర్వహించని పక్షంలో తీవ్ర చర్యలుంటాయని విద్యాశాఖ డైరెక్టర్ హెచ్చరించారు. ఇప్పటికే పరీక్ష పేపర్లను జిల్లాలకు పంపించగా.. శుక్రవారం డీసీఈబీ సెక్రెటరీ భీంరావు పాఠశాలలకు పంపిణీ చేశారు.



ప్రశ్నపత్రాలు అందజేస్తున్న డీసీఈబీ సెక్రెటరీ

జిల్లాలో పరీక్ష రాసే విద్యార్థులు తరగతి వారీగా..

మీడియం	3వ	6వ	9వ
ఇంగ్లిష్	3420	3828	3305
తెలుగు	1538	645	1169
ఉర్దూ	86	73	72
మొత్తం	5044	4546	4546

నేడు ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశం

పరీక్షల ప్రశ్నపత్రాలు అన్ని మండలాలకు పంపిణీ చేశాం. శనివారం ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశం యథావిధిగా నిర్వహిస్తూనే పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలి. ప్రధానోపాధ్యాయులు రెండింటిని సమన్వయం చేసుకుంటూ తప్పనిసరిగా పరీక్ష నిర్వహించాలి. – యాదయ్య, డీఈవో

లక్ష్మీ గణపతి



మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపంలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వినాయకుడి మండపాన్ని కరెన్సీతో అలంకరించారు. ఒక్క రూపాయి నుంచి రూ.500 కరెన్సీ నోట్లతో తీర్చిదిద్దారు. రూ.23,23,023లతో చూడముచ్చటగా తీర్చిదిద్దగా లక్ష్మీ గణపతి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. లక్ష్మీ గణపతిని శుక్రవారం రాత్రి జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు సురేఖ, అదనపు కలెక్టర్ మోతీలాల్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశం, ఆర్యవైశ్య సంఘం నాయకుడు ముక్తా శ్రీనివాస్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కవ్వాల్‌లో ఎఫ్‌సీఆర్‌ఐ విద్యార్థుల పర్యటన



వివరాలు తెలుపుతున్న ఎఫ్‌డీవో

జన్నారం: ములుగు ఫారెస్ట్ కళాశాల రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో చదువుతున్న విద్యార్థులు కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించారు. మొత్తం 55మందిలో 38మంది బాలికలు, 17 మంది బాలురు గురువారం రాత్రి జన్నారం చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి గొండుగూడ, బైసన్ కుంట ప్రాంతాల్లో, మధ్యాహ్నం ఇందన్‌పల్లి రేంజ్‌లోని ఘనిషెట్టికుంట, బర్తన్‌పేట్ ఏరియాల్లో పర్యటించారు. అడవుల్లో జరుగుతున్న అభివృద్ధి, అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ తదితర విషయాలను ఎఫ్‌డీవో మాధవరావు తెలియజేశారు. జన్నారం అడవుల్లోని ప్రత్యేక టేకువనం గురించి వివరించారు. గడ్డిక్షేత్రాలు, నీటి కుంటల నిర్వహణ తీరును వివరించారు. దట్టమైన అడవులను పరిశీలించి విశేషాలను తెలుసుకున్నారు. వారి వెంట రేంజ్ అధికారి హఫీజొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియర్స్ చెల్లింపుపై టీబీజీకేఎస్ హర్షం

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన 23 నెలల ఏరియర్స్ కంపెనీ చెల్లించడంతో టీబీజీకేఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏరియర్స్ డబ్బుల నుంచి కేంద్రం ఆస్తిపన్ను కోత పెట్టడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు బ్రహ్మచారి, దుర్గయ్య, అన్వేశ్‌రెడ్డి, పిట్ సెక్రటరీలు మహేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మెండ వెంకటి, తిరుపతి, శ్రీనివాసచారి, గడ్డం మల్లయ్య, పేగ మల్లయ్య, నాయకులు నీలం సదయ్య, తిరుపతిరావు, అన్వేశ్ తదితరులున్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీ

మంచిర్యాలటౌన్: 2023–2024 విద్యాసంవత్సరంలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి ఖాళీలు, 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 23వ తేదీన లక్సెట్టిపేట్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఉదయం 9 గంటలకు బాలికలు, బాలురకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ రీజియన్‌లోని తొమ్మిది బాలికల పాఠశాలలు, ఏడు బాలుర పాఠశాలల్లో ఐదో తరగతిలో 23 ఖాళీలు బాలురకు, నాలుగు బాలికలకు, ఆరో తరగతిలో ఆరు ఖాళీలు బాలురకు, బాలికలకు ఆరు ఖాళీలు, ఏడో తరగతిలో ఆరు బాలురకు, ఆరు బాలికలకు, ఎనిమిదో తరగతిలో బాలురకు మూడు ఖాళీలు, బాలికలకు ఐదు ఖాళీలు, తొమ్మిదో తరగతిలో 21 ఖాళీలు బాలురకు, 17 ఖాళీలు బాలికలకు ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ విద్యార్థులకు మాత్రమే ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన వీటీజీసెట్, బీఎల్‌వీసెట్‌లో ఎంపికై, వివిధ కారణాలతో పాఠశాలల్లో జాయిన్ కాని వారికి ముందు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులోనూ ఎస్సీ అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని స్వరూపారాణి వివరించారు.

రెండో విడతకు నిరీక్షణ

- రూ.లక్ష సాయంలో జాప్యం
- కొత్త దరఖాస్తులకు నో ఛాన్స్



దండేపల్లి: కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం పథకాన్ని ప్రవేశపెట్టింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 9న మంచిర్యాలలో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించారు. దీంతో బీసీవర్గాలకు చెందిన చేతివృత్తులవారు ఎంతో సంబురపడ్డారు. ఆర్థికసాయం పొందేందుకు ఆన్‌లైన్‌లో జూన్ 20లోపు దరఖాస్తు చేసుకున్నారు. పథకం అమలు తీరు చూస్తే ఆర్భాటమే మినహా ఆచరణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఆర్థికసాయం అందించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండగా దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడంలేదు. విడతలవారీగా సాయాన్ని అందిస్తామన్న ప్రభుత్వం మొదటి విడత సాయాన్ని జూలైలో ఇవ్వాల్సి ఉండగా ఆగస్టులో అందించింది. దీంతో మొదటి విడత కోసం దరఖాస్తుదారులు నెలపాటు ఎదురుచూశారు. రెండో విడత కోసం కూడా మళ్లీ ఎదురుచూడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

మొదటి విడతలో 900 మందికి..

రూ.లక్ష సాయం కోసం మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 11,106 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలన అనంతరం అధికారులు 7,700 మందిని అర్హులుగా గుర్తించారు. వీరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తో నిబంధనల ప్రకారం లేని 4,700 మందిని తొలగించి 3వేల మందిని అర్హులుగా గుర్తించారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 300 మంది చొప్పున జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 900 మందికి ఒక్కొక్కరికీ రూ.లక్ష సాయం అందించారు. ఇక అప్పటినుంచి రెండో విడత ఊసేలేదు. పైగా ఎంతమందికి ఇస్తారో? ఎప్పుడు ఇస్తారో? స్పష్టతలేదు.

కొత్త దరఖాస్తులకు అవకాశం లేదు

రూ.లక్ష ఆర్థికసాయం పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుకు కొద్దిరోజులే అవకాశం ఇచ్చారు. పైగా దరఖాస్తు సమయంలో కులం, నివాస ధ్రువపత్రాల వివరాలు నమోదు చేయాలని సూచించగా చాలామంది వాటికోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమయంలో సర్వర్ సమస్య తలెత్తగా సమయానికి చాలామందికి సర్టిఫికెట్లు అందలేదు. ఈలోపు దరఖాస్తు గడువు ముగిసింది. దీంతో చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. అలాంటి వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం మళ్లీ ఇవ్వలేదు. వెబ్‌సైట్ కూడా జూన్ 20న మూసివేశారు. దీంతో దరఖాస్తు అవకాశం కోల్పోయిన అర్హులు ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంజేస్తున్నారు.

బడ్జెట్ కేటాయించలేదు

బీసీ చేతి, కులవృత్తులవారికి రెండో విడత రూ.లక్ష ఆర్థికసాయానికి సంబంధించి ఇంకా బడ్జెట్ కేటాయించలేదు. దీంతో కొంత ఆలస్యం అయ్యేలా ఉంది. బడ్జెట్ కేటాయించిన వెంటనే చెక్కులు సిద్ధం చేసి పంపిణీ చేస్తాం. ఎంతమందికి.. ఎప్పుడు.. అనేది బడ్జెట్ కేటాయింపుపైనే ఆధారపడి ఉంటుంది. కొత్తవారికి మాత్రం దరఖాస్తు చేసుకునే అవకాశం ఇప్పుడైతే లేదు.

– వినోద్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారి

'అధికార' నేతలు చెప్పినవారికే..

రూ.లక్ష ఆర్థికసాయం అందించే విషయంలో అధికార బీఆర్‌ఎస్ నాయకుల హవా సాగుతోందనే ఆరోపణలున్నాయి. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేశారు. జాబితాలో పేర్లున్నా.. ఎవరెవరికి.. ఎప్పుడు ఇవ్వాలనేది.. మాత్రం అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన స్థానిక నేతల చేతుల్లోనే ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలదే పైచేయి ఉండటంతో ఈవిషయంలో అధికారులు ప్రేక్షకపాత్ర పోషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక నాయకులు ఎమ్మెల్యేలకు ఇచ్చిన పేర్లే లబ్ధిదారుల జాబితాలో వచ్చాయి. అర్హులకు సాయం అందిన దాఖలాలు లేవు. అధికారులు అర్హుల జాబితా సిద్ధం చేసినప్పటికీ ఎవరికి.. ఎప్పుడు.. ఇవ్వాలనేది మాత్రం ఆయా గ్రామాలు, మండల నాయకుల చేతుల్లోనే ఉందనే విమర్శలున్నాయి. దరఖాస్తుదారులు ముందుగా స్థానిక నాయకులను ప్రసన్నం చేసుకోకుంటే వారికి సాయం అందని దుస్థితి ఉంది. మొదటి విడతలో మొత్తం ఇలాగే జరిగిందనే ఆరోపణలు బాహాటంగా వినిపించాయి. దీంతో రెండో విడతలో సాయం అందుకోవాలనుకునే వారంతా అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. మొదటి విడతలో కొన్ని గ్రామాల వారికి అసలు అవకాశమే దక్కలేదు. ఊళ్లల్లో కులవృత్తుల వారు ఉన్నప్పటికీ కనీసం ఒక్కో కులంలో ఒక్కరికీ సాయం అందలేదు. మరి రెండో విడతలో ఎవరికి వస్తుందో.. ఎంతమందికి వస్తుందో.. ఎప్పుడు వస్తుందో.. వేచి చూడాలి మరి.

బ్రాండెడ్ పేరిట నకిలీ చలామణి



నకిలీ తయారీ కేంద్రంలో కంపెనీ సిబ్బంది



నకిలీ కంఫర్ట్ ప్యాకెట్లు

- మంచిర్యాల జిల్లాలో విక్రయాలు
- రూ.కోట్లల్లో వ్యాపారం
- తాజాగా తయారీ కేంద్రం గుట్టురట్టు

మంచిర్యాలక్రైం: సబ్బులు, నూనెలు, షాపులు, టీపొడి, బట్టలుతికే సర్ఫ్, బట్టలు ఉతికిన తర్వాత మంచి వాసన కోసం వినియోగించే కంఫర్ట్ ఇలా అన్నీ నకిలీవే మార్కెట్‌లో లభిస్తున్నాయి. బ్రాండెడ్ వస్తువుల పేరిట జిల్లాలో దర్జాగా దోపిడీ జరుగుతోంది. అన్ని వర్గాల ప్రజలు రోజూ ఉపయోగించే నకిలీ వస్తువులను జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ.కోటికి తగ్గకుండా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజులుగా జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని గర్మిళ్ల ఎస్‌బీహెచ్ బ్యాంక్ వెనుకాల బండారి రాజేంద్రప్రసాద్ ఇంట్లో బ్రాండెడ్ పేరిట నకిలీ కంఫర్ట్ ప్యాకెట్లను తయారు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆ కంపెనీ సిబ్బంది నాలుగు రోజుల క్రితం రాజేంద్రప్రసాద్ ఇంటిపై ఆకస్మిక దాడి నిర్వహించి నకిలీ గుట్టురట్టు చేశారు.

గుర్తు పట్టలేనంతగా...

బ్రాండెడ్ పేరుతో గుర్తు పట్టలేనంతగా నకిలీ కంఫర్ట్ ప్యాకెట్లు తయారు చేస్తూ జిల్లాలోని ఇతర కిరాణాషాపుల్లోకి సరఫరా చేస్తూ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఈ నకిలీ దందా నిర్వహిస్తున్న వ్యక్తి తన బైక్‌పై ప్రెస్, లాయర్ లోగో వేసుకుని చలామణి అవుతుండడం గమనార్హం. నకిలీ కంఫర్ట్ తయారీ చేస్తున్నారన్న సమాచారం మేరకు ఆ కంపెనీ అధికారులు ముంబై కోర్టులో కేసు వేశారు. కోర్టు అనుమతితో ఓ న్యాయవాదితో కలిసి నాలుగు రోజుల క్రితం స్థానిక పోలీసుల సహకారంతో రాజేంద్రప్రసాద్ ఇంటిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.50వేల విలువైన కంఫర్ట్ ప్యాకెట్లు లభించాయి. దీంతో తయారీదారుడిపై కేసు నమోదు చేసి, నకిలీ కంఫర్ట్‌లను సీజ్ చేసి వెళ్లిపోయారు.

తనిఖీ అధికారులేరి?

జిల్లా వ్యాప్తంగా కొన్నేళ్లుగా నకిలీ వస్తువుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు, టాస్క్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేసిన దాఖలాలు లేవు. నకిలీ వస్తువులపై వినియోగదారులు ఫిర్యాదు చేయాలన్నా అధికారులు ఫోన్‌లో అందుబాటులోకి రావడం లేదు. తూనికలు, కొలతల శాఖ, కల్తీ నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందించినా స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1983 జనాభా లెక్కల ప్రకారం రెండు ఆహార పర్యవేక్షణ అధికారుల పోస్టులు మంజూరు చేశారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ఇద్దరు అధికారుల్లో ఒకరు ఏసీబీకి చిక్కారు. మరొకరు రిటైర్డ్ అయ్యారు. దీంతో కొద్దిరోజులుగా ఇన్‌చార్జి అధికారులే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలకు పూర్తి స్థాయిలో ఆహారపర్యవేక్షణ అధికారులు లేక నకిలీ దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో నకిలీ కంఫర్ట్ తయారీ కేంద్రం గుట్టురట్టుపై స్థానిక సీఐ రాజును వివరణ కోరగా, ముంబై నుంచి హైకోర్టు ఉత్తర్వులతో కంఫర్ట్ కంపెనీ సిబ్బంది, ఓ న్యాయవాదితో వచ్చి రక్షణ కల్పించాలని కోరడంతో వారికి సహకరించామని తెలిపారు.

ఇద్దరు మావోయిస్టు కొరియర్ల అరెస్ట్



కొరియర్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వాజేడు: ఇద్దరు మావోయిస్టు కొరియర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. ములుగు జిల్లా వాజేడు మండలంలో సీఐ బండారు కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఏటూరునాగారం వైపు నుంచి వచ్చిన ఆటోను పరిశీలించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీకి చెందిన కలువల ఐలమ్మ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారం గ్రామానికి చెందిన ఆలూరి దేవేందర్ అనుమానాస్పద బ్యాగులతో కనిపించారు. వారిని కిందకు దింపి బ్యాగులు పరిశీలించగా.. పేలుడు పదార్థాలైన కార్డన్ వైర్, డిటోనేటర్లు, బ్యాటరీలు, మరికొన్ని వస్తువులు కనిపించాయి. ఇద్దరు సాక్ష్యుల మధ్య పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వెంకటాపురం (కే) సీఐ బండారు కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిషేధిత మావోయిస్టు అగ్ర నాయకులకు ఐలమ్మ, దేవేందర్ కొంతకాలంగా కొరియర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ అగ్రనాయకుల ఆదేశానుసారం వారు ఆవిర్భావ వారోత్సవాల్లో కూంబింగ్‌కు వెళ్లే పోలీసులను చంపాలని అమర్చే ప్రెషర్‌బాంబు తయారీకి ఉపయోగించే పేలుడు పదార్థాలు తీసుకెళ్తుండగా గుర్తించామని పేర్కొన్నారు. వీరిని కోర్టుకు పంపనున్నట్లు వివరించారు.

ఓసీపీలో ఘనంగా హోమం



పూర్ణాహుతిలో పాల్గొన్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై గణేశ్ మండపం వద్ద గని మేనేజర్ సుధీర్ ఆధ్వర్యంలో శుక్రవారం హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి, ఓపెన్‌కాస్ట్ అధికారి పురుషోత్తంరెడ్డి తదితరులు హోమం, పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గని సీనియర్ అండర్ మేనేజర్ వెంకన్న, బ్లాస్టింగ్ ఇన్‌చార్జి గొల్లపల్లి సంపత్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: మద్యం మత్తులో నాలుగేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన కేసులో జైనూర్‌కు చెందిన మక్కల భీమయ్యకు జీవిత కఠిన కారాగారశిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ శుక్రవారం తీర్పు చెప్పారు. లైజన్ అధికారి బషీరొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలం సంజీవనగర్‌కు చెందిన నాలుగేళ్ల చిన్నారి డిసెంబర్ 2, 2018న ఇంట్లో ఆడుకుంటుండగా మక్కల భీమయ్య బబ్బాలు కొనిస్తానని చెప్పి పక్కనే ఉన్న ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారికి తీవ్ర రక్తస్రావం కావడంతో విషయం నానమ్మ గంగుబాయికి తెలిపింది. దీంతో గంగుబాయి ఫిర్యాదు మేరకు జైనూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ సాదిక్‌పాషా, శ్రీనివాస్ నేర పరిశోధన చేశారు. అనంతరం పోలీసులు 26మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి పైతీర్పు చెప్పారు. ఈ కేసులో పీపీ జీవీఎస్ ప్రసాద్ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.

న్యాయవాదుల అంతర్జాతీయ సదస్సుకు సత్తయ్య



మంచిర్యాలక్రైం: ఈ నెల 23, 24న ఢిల్లీలో జరిగే న్యాయవాదుల అంతర్జాతీయ సదస్సుకు మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కొత్త సత్తయ్య హాజరు కానున్నారు. ఈ మేరకు ఆహ్వానం అందగా.. పీఎం కార్యాలయం నుంచి అనుమతి లభించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిర్వహించే ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి బార్ అసోసియేషన్ అధ్యక్షులతోపాటు న్యాయవాదులు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు హాజరవుతారు. వివిధ చట్టాల అమలు తీరు, కొన్ని ముఖ్యమైన అంశాలపై చర్చాగోష్టి ఉంటుంది. సలహాలు, సూచనలు, అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంది.

గుండెపోటుతో వ్యాపారి మృతి



రాజేంద్రప్రసాద్ (ఫైల్)

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన వ్యాపారి అసావా రాజేంద్రప్రసాద్ (40) ఇంట్లో గుండె పోటుకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మార్వాడీ ధర్మశాలలో ఏర్పాటు చేసిన గణేశ్ మండలి వద్ద గురువారం రాత్రి నిర్వహించిన పూజల్లో రాజేంద్రప్రసాద్ పాల్గొని ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. వ్యాపారి మృతికి సంతాపంగా పట్టణంలోని వ్యాపార సంస్థలు శుక్రవారం బంద్ పాటించాయి. మాజీ విప్ నల్లాల ఓదెలు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు దుర్గం నరేశ్ ఉన్నారు.

'గుర్తింపు' ఎన్నికలపై మళ్లీ కొర్రీ

- ఎన్నికల షెడ్యూల్ వాయిదా వేసిన రిటర్నింగ్ అధికారి
- ఎన్నికలవరకు అన్ని సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఉత్తర్వులు

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై మళ్లీ కొర్రీ పడింది. షెడ్యూల్‌ను శుక్రవారం ప్రకటిస్తారని అనుకుంటే ఎటూ తేలకుండా మళ్లీ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 27న తిరిగి సమావేశమై చర్చిస్తామని ఎన్నికల రిట్నరింగ్ అధికారి, డెప్యూటీ సీఎల్సీ శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఎన్నికలపై సమావేశం జరిగింది. దీనికి 14 కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన సమావేశంలో ఇంతకుముందు జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని కార్మిక సంఘాల నేతలు రిటర్నింగ్ అధికారిని కోరారు. దీనిపై కార్మిక సంఘాల నేతలంతా తమ వాదనలు వినిపించారు. అనంతరం సాయంత్రం మళ్లీ సమావేశం నిర్వహించారు. దీనికి కంపెనీ నుంచి డైరెక్టర్ (పా) ఫైనాన్స్ బలరాం హాజరయ్యారు. డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండనున్నందున ప్రస్తుతం గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని కలెక్టర్లు పేర్కొంటున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చినట్లు బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, హెచ్‌ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. ఇదే విషయమై కంపెనీ హైకోర్టుకు తిరిగి వెళ్లడం.. దీనిపై వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్‌లో పెట్టడంతో ఉన్న ఫలంగా షెడ్యూల్ ఇవ్వద్దని కంపెనీ కోరింది. దీంతో ఈ నెల 27న తిరిగి సమావేశం అవుదామని చెప్పి రిటర్నింగ్ అధికారి షెడ్యూల్ ఇవ్వకుండా సమావేశాన్ని వాయిదా వేశారు.

ఉత్తర్వులు జారీ..

గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసి ఎన్నికలు నిర్వహించడానికి జాప్యం జరుగుతున్నందున ఎన్నికలు నిర్వహించేదాకా అన్ని కార్మిక సంఘాలను సమానంగా గుర్తిస్తూ, ప్రాతినిధ్యం కల్పించాలని కార్మిక సంఘాల నేతలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఈ సమావేశంలోనే డైరెక్టర్ (పా) ఉత్తర్వుల కాపీని నేతలకు అందించారు. ఎన్నికలు జరిగేదాకా 14 రిజిస్టర్డ్ సంఘాల ప్రతినిధులను గుర్తింపు సంఘం నాయకులతో పాటు సమానంగా గనులు, ఏరియా, కంపెనీ స్థాయిలో జరిగే అధికారిక సమావేశాలు, చర్చలు, సంప్రదింపులు, కార్యక్రమాలకు ఆహ్వానించేలా ఏరియా జీఎంలకు డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

'కొత్తవారిని నియమించొద్దు'

రెబ్బెన (ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా కొత్త నియామకాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌ను కలిసి కొత్త నియామకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓదెలు మాట్లాడుతూ.. ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ ఆర్‌ఎంజీ ఎండీ మహిధర్‌గౌడ్ చాటుమాటుగా మెడికల్, వీటీసీ చేయించి కొత్త వారిని సెక్యూరిటీ గార్డులుగా నియమించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలని కోరారు. సింగరేణిలో ఎక్కడా లేని విధంగా పర్మినెంట్ కార్మికులకు లేని వృత్తిపన్నును గత మే నుంచి ఏరియాలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నుంచి వసూలు చేయడాన్ని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని వృత్తి పన్ను కోత జరగకుండా ఆపాలని కోరారు. ప్రతినెలా సెక్యూరిటీ గార్డులు వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని, 7వ తేదీ లోపు వేతనాలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. పనిస్థలాల్లో కనీస వసతులు, రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఏరియాలో ఇప్పటికే 124 పోస్టులకు గాను 160 మంది ప్రైవేట్ సెక్యూరిటీగార్డులు పని చేస్తున్నారని, ఇప్పటికే మస్టర్లు తగ్గి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కొత్తవారిని నియమిస్తే మరింత ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీగార్డులు కోట కేశవ్, రాజశేఖర్, లింగయ్య, చిరంజీవి, శంకర్, రాజు, తిరుపతి, రాజు తదితరులున్నారు.

'ఆదాయపన్ను రద్దు చేయాలి'

శ్రీరాంపూర్: బొగ్గుగని కార్మికులను ఆదాయపన్ను నుంచి మినహాయించాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి జీ భాగ్యరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఎస్సార్పీ–3 గనిపై కార్మికులను కలిసి మాట్లాడారు. సరిహద్దులో సైనికుల్లాగా సింగరేణి కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నారని తెలిపారు. సైనికుల మాదిరిగానే సింగరేణి కార్మికులకూ ఆదాయపన్ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఇటీవల చెల్లించిన 11వ వేతన ఒప్పంద బకాయిలు ఎంత వచ్చినా దానిలో 30 శాతం ఆదాయపన్నుకే పోతోందని తెలిపారు. దీంతో కార్మికులు తీవ్ర నిరాశ చెందుతున్నారని పేర్కొన్నారు. కార్మికుడు కష్టపడి సంపాదించిన డబ్బులు ప్రభుత్వ ఖజానాకే పోతున్నాయని తెలిపారు. ఎన్నికలప్పుడు రాజకీయ పార్టీల నేతలు తాము గెలిస్తే, అధికారంలోకి వస్తే ఆదాయపన్ను మాఫీ చేస్తామని హామీలు ఇస్తూ గెలిచాక విస్మరిస్తున్నారని ఆరోపించారు. వారు గనులపైకి వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెస్ పోటీలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఆవరణలో శనివారం ఉమ్మడి జిల్లా ఓపెన్ టూ ఆల్ చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా చెస్ చైర్మన్ ఈగ కనకయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9గంటలకు పాఠశాలకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సైన్స్‌పై అవగాహన

జైపూర్: విద్యార్థినులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని జిల్లాస్థాయి విజ్ఞాన సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్ తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు శుక్రవారం జిల్లా సైన్స్ అధికారి మధుబాబు సైన్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్వో ఫణిబాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణలో మండల పీఠాధిపతులు



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పీఠాధిపతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటైన మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఓంకారేశ్వర్‌లోగల మాధాత పర్వతంపై ప్రతిష్ఠించిన 108 అడుగుల ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణలో హాజీపూర్ మండల పీఠాధిపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజీపూర్ మండలం ముల్కల్ల శ్రీగాయత్రీ విశ్వకర్మ శారదాపీఠాధిపతులు శ్రీచంద్రమౌళీశ్వరస్వామి, శ్రీవిశ్వంభరస్వామి అక్కడికి వెళ్లారు. 21వ తేదీ గురువారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న వీరికి మహారాష్ట్ర సీఎం స్వాగతం పలికారు. దేశవిదేశాల నుంచి పాల్గొన్న దాదాపు ఐదువేలమంది మఠాధిపతులు, పీఠాధిపతులు, ఆశ్రమాధిపతులు, పలువురు స్వామీజీల ఆధ్యాత్మిక సందేశంలో ముల్కల్ల పీఠాధిపతులు భాగస్వాములయ్యారు.

బెల్లంపల్లి సీవోఈలో జోనల్‌స్థాయి క్రీడలు

- అక్టోబర్ 13–16 తేదీల్లో పోటీలు
- నాలుగుజిల్లాల నుంచి 935 మంది రాక



మైదానాన్ని పరిశీలిస్తున్న ఆర్సీవో, ప్రిన్సిపాల్‌లు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) లో ప్రప్రథమంగా జోనల్‌స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు సంక్షేమ గురుకులాల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో కొప్పుల స్వరూపారాణి తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి సీవోఈ కళాశాల క్రీడా మైదానాన్ని రీజినల్ స్పోర్ట్స్ ఆఫీసర్ సట్ల శంకర్, సంక్షేమ గురుకుల సీవోఈ ప్రిన్సిపాల్ సైదులు, కాసిపేట గురుకుల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్సీవో మాట్లాడుతూ.. అక్టోబర్ 13 నుంచి 16వ తేదీ వరకు జోనల్‌స్థాయి క్రీడాపోటీలు బెల్లంపల్లి సీవోఈలో నిర్వహించడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. పోటీలకు కాళేశ్వరం జోన్ పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని 11బాలుర గురుకులాలకు చెందిన 935 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. విద్యార్థులకు అండర్ –14, 16, 19 విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, బాల్ బాడ్మింటన్, హ్యాండ్ బాల్, టెన్నీ కాయిట్, ఖోఖో, చదరంగం, క్యారమ్స్, 100, 200, 400, 800, 1,500 మీటర్లు, ఐదు కిలో మీటర్ల పరుగుపందెం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్, రిలే విభాగాల్లోనూ పోటీలుంటాయని వివరించారు. జోనల్ స్థాయి విజేతలకు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత ఉంటుందని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు వామన్, రాకేశ్, సంతోష్, శ్రీకాంత్, జేవీపీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వివాహిత మృతదేహం లభ్యం



తాళ్లపల్లి గౌరక్క (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీకి చెందిన తాళ్లపల్లి గౌరక్క (45) అదృశ్యమై శుక్రవారం ఎల్లంపల్లి ప్రాజెక్టులో మృతదేహమై కనిపించింది. హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నంనూర్‌లో నివాసముంటున్న గౌరక్క ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. గురువారం ఉదయం కూడా భర్తతో గొడవ కావడంతో కోపంతో ఇంట్లోంచి బయటకు వెళ్లింది. భర్త శ్రీనివాస్‌తో పాటు కుమారుడు ప్రశాంత్ గురు, శుక్రవారాల్లో గ్రామ పరిసరాలు, బంధుమిత్రుల ఇళ్లల్లో విచారించగా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం సాయంత్రం హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై నరేశ్‌కుమార్ గౌరక్క ఆచూకీ కోసం గాలిస్తున్న క్రమంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిలో ఆమె మృతదేహం లభ్యమైంది. ఆమె భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.